## వాట్ ఏ 'పవర్‌ఫుల్' స్పీచ్!

- ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలించింది
- కేసీఆర్ ప్రసంగంపై 'గ్రోక్' చాట్‌బాట్ విశ్లేషణ
- ఇది కేసీఆర్ ముద్రకు నిదర్శమన్న చాట్‌జీపీటీ




(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): "బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. దీనిపై మీడియాలో కథనాలూ వెలువడ్డాయి. బీఆర్‌ఎస్ సభ, కేసీఆర్ ప్రసంగం, ప్రజాస్పందనపై ఏఐ చాట్‌బాట్‌లను 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి ప్రశ్నించగా ఆయా చాట్‌బాట్‌లూ ఇదే విషయాన్ని ధ్రువీకరించాయి.

**ప్రశ్న:** బీఆర్‌ఎస్ సభ సక్సెస్ అయిందా?

**గ్రోక్:** అవును. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైంది. ఈ సభకు ప్రజలు భారీగా వచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజల నుంచి ఉత్సాహభరితమైన స్పందన వచ్చింది.

**చాట్ జీపీటీ:** ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఈ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

**ప్రశ్న:** కేసీఆర్ ప్రసంగం ఎలా సాగింది?

**గ్రోక్:** కేసీఆర్ ప్రసంగం ఆనాటి తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని రగిలించింది. చివరివరకు ఉద్వేగభరితంగా, ప్రజలను, కార్యకర్తలను ఉత్తేజపరిచేలా సాగింది. లక్షలాది మంది హాజరైన ఈ సభలో కేసీఆర్ తన పాత శైలిలో ప్రత్యర్థులపై విమర్శలను ఎక్కుపెట్టడమే కాకుండా పార్టీ బలాన్ని కూడా చాటారు. పార్టీ భవిష్యత్తు దిశను చూపుతూ సాగిన ఒక శక్తిమంతమైన ప్రసంగమని చెప్పొచ్చు.

**చాట్‌జీపీటీ:** రజతోత్సవ సభలో కేసీఆర్ గర్జించారు. ఆయన ప్రసంగం చివరివరకు ఉద్వేగభరితంగా సాగింది.

**ప్రశ్న:** కేసీఆర్ ప్రసంగానికి ప్రజల నుంచి ఎలాంటి స్పందన వచ్చింది?

**గ్రోక్:** కేసీఆర్ ప్రసంగంలో ఉద్యమ స్ఫూర్తిని, రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని ఉద్ఘాటించడంతో సభకు హాజరైన లక్షలాది మంది ప్రజలు హర్షధ్వానాలతో, చప్పట్లతో స్పందనను తెలియజేశారు. తెలంగాణ పోరాట జ్ఞాపకాలు, బీఆర్‌ఎస్ విజయాలను ప్రస్తావించినప్పుడు ప్రజలు ఉద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేస్తున్నప్పుడు జనం హర్షం వ్యక్తంచేశారు. ప్రజాస్పందన చూస్తుంటే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని అర్థం చేసుకోవచ్చు.

**చాట్‌జీపీటీ:** కేసీఆర్ ప్రసంగం సాగుతున్నంతసేపూ ప్రజల్లో ఉత్సాహం కనిపించింది. ప్రసంగ సమయంలో ప్రజల స్పందనను చూస్తే తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వేసిన శాశ్వతమైన ముద్ర ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

## జాతీయ మీడియాలో 'రజతోత్సవ సంబురం'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జాతీయ మీడియాలోనూ విస్తృతంగా కవరేజీ లభించిం ది. ఇంగ్లిష్‌లో ప్రధాన న్యూస్ వెబ్‌సైట్లు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రముఖంగా ప్రచురించా యి. పలు టీవీ ఛానల్స్ కూడా సభ వివరాలను, వీడియోలను ప్రసారం చేశాయి. ముఖ్యంగా 'కగర్ ఆపరేషన్ పేరిట ఛత్తీస్‌గఢ్‌లో కేంద్రప్రభుత్వం యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తున్నది' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ అంశాన్నే హెడ్‌లైన్‌గా మార్చి పలు వెబ్‌సైట్లు కథనాన్ని ప్రచురించాయి. తెలంగాణకు నంబ ర్-1 విలన్ కాంగ్రెస్ అన్న కేసీఆర్ వ్యాఖ్యలను కూడా మరికొన్ని న్యూస్ వెబ్‌సైట్లు త మ కథనాలకు శీర్షికలుగా పెట్టాయి. మొత్తంగా బీఆర్‌ఎస్ సభ విజయవంతమైందంటూ కథనాల్లో పేర్కొన్నాయి.

**ఇంగ్లీష్ న్యూస్ వెబ్‌సైట్లలో హెడ్‌లైన్స్**

**ది హిందూ:** కేసీఆర్ సర్‌ప్రైజెస్ బై రేకింగ్‌అప్ మావోయిస్ట్ ఇష్యూ

**సౌత్‌ఫస్ట్:** కేసీఆర్ డిమాండ్స్ హాల్ట్ టు ఆపరేషన్ కగార్

**పీటీఐ:** కేసీఆర్ అర్జెస్ సెంటర్ టు హాల్ట్ 'ఆపరేషన్ కగార్'

**ది స్టేట్‌మన్:** కేసీఆర్ డబ్ కాంగ్రెస్ యాజ్ విలన్ నంబర్ వన్ ఫర్ తెలంగాణ

**టైమ్స్ ఆఫ్ ఇండియా:** బీఆర్‌ఎస్ రింగ్ ఇన్ సిల్వర్ జూబ్లీ మీటింగ్

**ది న్యూస్ మినట్:** బీఆర్‌ఎస్ సెలబ్రేటెడ్ సిల్వర్ జూబ్లీ మీటింగ్ ఇన్ వరంగల్

**డెక్కన్ హెరాల్డ్:** బీఆర్‌ఎస్ సెలబ్రేటెడ్ సిల్వర్ జూబ్లీ మీటింగ్ ఇన్ వరంగల్

**సియాసాత్ :** కాంగ్రెస్ నంబర్ 1 విలన్ ఆఫ్ తెలంగాణ.. విల్ నాట్ త్రోఅవుట్ గవర్నమెంట్: కేసీఆర్

# లారీలు అడ్డుపెట్టి.. ఆపేసే యత్నం

**బీఆర్‌ఎస్ సభకు పోలీసుల అత్యుత్సాహం • ట్రాఫిక్ దారి మళ్లించడంతో ఇబ్బందులు**

**వేలాదిగా రోడ్లపైనే నిలిచిన వాహనాలు • ఎక్కడికక్కడే భారీగా ట్రాఫిక్ సమస్యలు**

**జెండాలు కట్టినందుకు పోలీసుల కేసులు • వేదికకు 12 కి.మీ దూరంలో తలసాని.. సభవైపు రాకుండా అడ్డుకున్న పోలీసులు**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ)/ఖమ్మం/సిద్దిపేట, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రోడ్లపై లారీలను అడ్డంగా పెట్టించారు.. ట్రాఫిక్‌ను మళ్లించారు.. రోడ్లపై పలుచోట్ల నిలిచిన వాహనాలు.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ చిక్కులు.. ఇవీ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్తున్న శ్రేణులకు పోలీసుల నుంచి ఎదురైన అడ్డంకులు. ఆదివారం ఉదయం నుంచే ఎల్కతుర్తివైపు దారులన్నీ గులాబీమయం అయ్యాయి. దీంతో కాంగ్రెస్ పెద్దల గుండెల్లో గుబులు చెలరేగింది. అడుగడుగునా 'జై కేసీఆర్.. జై బీఆర్‌ఎస్' అన్న నినాదాల హోరును జీర్ణించుకోలేకపోయారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ఊరూరా పండుగలా బీఆర్‌ఎస్ సభవైపు వెళ్తుండటాన్ని టీవీల్లో చూసి పోలీసులను ఉసిగొల్పారు. లక్షలాదిగా తరలివస్తున్న గులాబీ రథచక్రాలను అడ్డుకునేందుకు అధికారాన్ని ప్రయోగించారు. ఇదే అదనుగా పోలీసులు రోడ్లకు అడ్డంగా లారీలను పెట్టించి.. ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో లక్షలాదిమంది తరలివచ్చిన బస్సులు, లారీలు, మినీ లారీలు, ఆటోలు, కార్లలోనే ఉండిపోయారు. సభకు రాకుండానే ఆయా వాహనాల్లో ఉండే కేసీఆర్ ప్రసంగాన్ని విన్నారు. కొన్నిచోట్ల బస్సులు, వాహనాలకు బీఆర్‌ఎస్ జెండాలు కట్టొద్దంటూ, స్టిక్కర్లు అంటించొద్దంటూ ఆదేశాలు జారీచేశారు. కొన్నిచోట్ల జెండాలు కట్టినందుకే కార్యకర్తలపై కేసులు పెట్టారు. సభకు వెళ్లకుండా ప్రైవేట్ వాహనాలను అడ్డుకొని, ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో కొన్ని ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు.



### ఎర్రటెండలో ట్రాఫిక్ క్లియర్ చేసిన హరీశ్‌రావు

'పోనియ్.. ముందుకుపోనియ్.. బండ్లు ఎక్కడా ఆగొద్దు.. నేరుగా సభ వద్దకే వెళ్లాలి' అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎర్రటి ఎండలో రోడ్డుపై నిలబడి వాహనదారులకు సూచిస్తూ, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎల్కతుర్తికి వెళ్లే రహదారులపై గులాబీ శ్రేణుల వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా వాహనాల డ్రైవర్లకు తగు సూచనలు ఇవ్వసాగారు. కార్లు, బస్సుల్లో వెళ్తున్న గులాబీ శ్రేణులను హరీశ్‌రావు ఉత్సాహపరిచారు. ఆదివారం మిట్ట మధ్యాహ్నం కారు దిగి.. ఎర్రటి ఎండలో రోడ్డుపక్కన నిలబడి చేయి ఊపుతూ.. ముందుకు కదలాలని ఇలా వాహనదారులకు మార్గదర్శనం చేశారు.

**సిద్దిపేట రంగధాంపల్లి వద్ద ట్రాఫిక్ చిక్కులు**

మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు సిద్దిపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాహనాలు సిద్దిపేట మీదుగా బయలుదేరాయి. సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తా వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. హైదరాబాద్ వైపు పొన్నాల వరకు, మెదక్ రూట్‌లో విపంచి భవన్ వరకు, కరీంనగర్ రూట్‌లో నర్సాపూర్ చౌరస్తా వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జాం పేరిట పోలీసులే దగ్గరుండి వందలాది వాహనాలను తిప్పి పంపారని బీఆర్‌ఎస్ శ్రేణులు తెలిపాయి. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి ఎల్కతుర్తికి వెళ్లే 1,000కి పైగా వాహనాలను హుస్నాబాద్ దాటిన తర్వాత కొత్తపల్లి నుంచి యూటర్న్ చేసి తిరిగి సిద్దిపేట వైపు పోలీసులు మళ్లించారు. ఆర్టీవో అధికారులను అడుగడుగునా పెట్టి వాహనాలు చెక్ చేయించారు. స్కూల్ బస్సులు అద్దెకు ఇచ్చిన వారికి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేశారు. సిద్దిపేట ఏసీపీ మధు సిబ్బందితో ఆలస్యంగా చేరుకున్నారు. కనీసం ట్రాఫిక్‌ను క్లియర్ చేయకపోగా, హనుమకొండ రూట్‌లో వెళ్లాల్సిన వాహనాలను కరీంనగర్ రూట్‌లో ఎదురు పంపుతూ రెండు కిలోమీటర్ల దూరంలోని నర్సాపూర్ చౌరస్తా నుంచి తిరిగి వచ్చేలా ఏసీపీ మళ్లించారు. దీంతో మరింత ట్రాఫిక్ చిక్కులు ఏర్పడ్డాయి. దీంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వచ్చి ట్రాఫిక్‌ను స్వయంగా క్లియర్ చేసి వాహనాలు త్వరగా వెళ్లేలా చొరవ చూపారు.

**ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా వద్ద భారీగా..**

ఓఆర్‌ఆర్‌పై ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా వద్ద భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వేలాది వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి భారీ సంఖ్యలో వెళ్లే వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వాహనాలు ఈ ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. సిద్దిపేట ఎక్స్‌రోడ్స్ రంగధాంపల్లి వద్ద భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి వేలాది వాహనాలు కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయాయి. దీంతో హరీశ్‌రావు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చొరవ తీసుకున్నారు.

**వరంగల్‌కు 20 కి.మీ మేర నిలిచిన ట్రాఫిక్**

వరంగల్ నగరానికి నలుదిక్కులా వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ఒక్కసారిగా దారులన్నీ కిక్కిరిసిపోయాయి. సభా వేదికలకు కేసీఆర్ వచ్చే ముందు వరంగల్ నలువైపులా దాదాపు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచింది. వేలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి. లక్షలాది మంది ట్రాఫిక్ కారణంగా సభా వేదికకు చేరుకోలేక తమతో తెచ్చుకున్న భోజనాలు, పులిహోర, ఇతర తినుబండారాలు తిని రోడ్డుపైనే కేసీఆర్ ప్రసంగం విన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వేదికకు 12 కిలోమీటర్ల దూరంలో ఉండగానే ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. పోలీసులు లారీలు తెచ్చి అడ్డం పెట్టి మరీ.. సభ వైపు వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లించారని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేశారు.

**ఖమ్మంలో ఆర్టీఏ అధికారులు, పోలీసుల అత్యుత్సాహం**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ శ్రేణులను అడ్డగించేందుకు ఆర్టీఏ అధికారులు, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బీఆర్‌ఎస్ వాహనాలను అడుగడుగునా అడ్డుకున్నారు. కల్లూరు, తిరుమలాయపాలెం వద్ద వాహనాలను రవాణా శాఖ అధికారులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కల్లూరు వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చొరవతో వాహనాలను వదిలారు. తిరుమలాయపాలెం వద్ద అనేక వాహనాలను ఆర్టీఏ అధికారులు తనిఖీల పేరిట నిలిపివేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తదితరులు చేరుకుని ఆర్టీఏ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వారు దగ్గరుండి వాహనాలను పంపించారు. మరోసారి తిరుమలాయపాలెం వద్ద బస్సులను ఆపుతున్నారని తెలుసుకుని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి చేరుకున్నారు. ఇబ్బందులు పెడితే ధర్నా చేస్తానని ఆర్టీఏ ఉన్నతాధికారులకు ఫోన్లో హెచ్చరించడంతో వారు వెనక్కి తగ్గగా, వాహనాలు ముందుకు కదిలాయి.

> **అన్నా.. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాం**
>
> 'అన్నా.. కేటీఆర్ అన్నా.. హరీశ్ అన్నా.. ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోయాం. సభకు అందుకోలేకపోయాం' అంటూ ఎంతోమంది కార్యకర్తలు, ముఖ్యనేతలు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలకు వాట్సాప్‌లో వీడియో సందేశాలు పంపారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులు ఎంత ఘోరంగా విఫలమయ్యారో వివరిస్తూ ముఖ్య నాయకులకు మెసేజ్‌లు చేశారు.

**కాంగ్రెస్ దుష్టపన్నాగం: హరీశ్‌రావు**

బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్రలు, కుతంత్రాలతో దుష్టపన్నాగం పన్నిందని, బీఆర్‌ఎస్ విజయోత్సవాన్ని అడ్డుకోలేక పోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారు అరాచకాలను ఎండగట్టారు. సభను అడ్డుకోవడం కోసం ఆదివారం ఉదయం నుంచి కాంగ్రెస్ సర్కారు కుట్రలు పన్నిందని ధ్వజమెత్తారు. సహాయ నిరాకరణ చేసి సభను ఫెయిల్ చేసే కుట్ర చేసిందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తెలంగాణ ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పటాపంచెలు చేశారని స్పష్టంచేశారు. అడుగడుగున పోలీసుల ఆంక్షలు, నిర్బంధాలు ప్రయోగించిందని మండిపడ్డారు. రజతోత్సవ సభ అనగానే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయని, ఈ సభలో కాంగ్రెస్ అరాచకాలను కేసీఆర్ నిలదీస్తడు అనగానే ప్రభుత్వానికి వెన్నుల్లో వణుకు పుట్టిందని పేర్కొన్నారు. సభా స్థలికి తమ పార్టీ కార్యకర్తలు చేరకుండా 10 నుంచి 15 కి.మీ మేర ట్రాఫిక్ చిక్కులు కల్పించారని దుయ్యబట్టారు. సాక్షాత్తు పోలీసులే దగ్గరుండి వందలాది వాహనాలను వెనక్కి తిప్పి పంపారని తీవ్రంగా ఆరోపించారు. ఇది ఆరంభం మాత్రమే అని, ప్రజలను నమ్మించి నయవంచన చేసిన తమ మోసపూరిత వైఖరికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు.

## సముదాయిస్తూ.. సహాయం చేస్తూ

**వలంటీర్ల సేవలు అనిర్వచనీయం**

**పార్కింగ్ స్థలాలు, గ్రౌండ్‌లో విశేష సేవలు**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 27: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో వలంటీర్ల సేవలు అనిర్వచనీయం. బహిరంగ సభ అనుకున్నప్పటి నుంచి సుమారుగా 2,500 మంది పురుష, మహిళ వలంటీర్లను సభ నిర్వాహకులు ఎంపిక చేశారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బహిరంగ సభ సందర్భంగా గ్రౌండ్, పార్కింగ్, ట్రాఫిక్ ఏరియాలు, వరంగల్-కరీంనగర్-సిద్దిపేట ప్రధాన రహదారుల్లోని పార్కింగ్ స్థలాల్లో వారిని నియమించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు కేటాయించిన స్థలాలను వారికి చూపిస్తూ అక్కడే పార్క్ చేసేలా చూశారు. సభలో కార్యకర్తలు, ప్రజలకు విశేష సేవలు అందించారు. సభకు వచ్చిన ప్రజలకు వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఒకానొక దశలో ప్రజల్ని కంట్రోల్ చేయడానికి పోలీసులు సైతం వలంటీర్ల సేవలను తీసుకోవడం విశేషం. సభ ముగిసిన తర్వాత సైతం వాహనాలు వెళ్లేందుకు లైన్ క్లియర్ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూశారు. మొత్తానికి సభలో వలంటీర్లు చేసిన సేవలకు సభకు వచ్చిన వారు అభినందనలు తెలిపారు.



**ఇంటి పండుగలా సేవలందించాం**

మన ఇంట్లో పండుగ జరిగితే ఎలా పని చేస్తామో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకూ అలాగే సేవ చేశాం. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఆ మాత్రం పార్టీకి సేవ చేయడం అదృష్టంగా భావిస్తాం. వలంటీర్‌గా సేవ చేయాలని కోరగా వెంటనే అంగీకరించాను. మాకు ప్రత్యేక టీ షర్ట్‌లతోపాటు శిక్షణ ఇచ్చారు. సభకు వచ్చే వారి పట్ల మర్యాదగా, సేవాభావంతో మెలగాలని సూచించారు. సభకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతమైనందుకు సంతోషంగా ఉంది.

– కొమ్ముల సాగర్, వలంటీర్

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్

- ఉద్యమపార్టీ రజతోత్సవం.. ప్రజాపోరుకు సమరశంఖం
- ఉద్యమ బాటలో పురుడు పోసుకున్న తెలంగాణ ప్రాణం
- పోరు పథంలో ఊపిరి పీల్చుకున్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష
- భారీ సభతో మరో రణానికి బీఆర్‌ఎస్ నాంది పలికింది
- తెలంగాణవాదులు, విశ్లేషకుల్లో వ్యక్తమైన అభిప్రాయం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నిండు అమాస చీకట్లలో ఓ వేగుచుక్క విరిసింది. కాంగ్రెస్ అంధకార పాలనపై బీఆర్‌ఎస్ సమరశంఖం పూరించింది. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం.. కాంగ్రెస్ కబంధ హస్తాల్లో నలిగిపోతున్నదని, తెలంగాణను కాపాడుకుందామని ఉద్యమనేత కేసీఆర్ ఓ రణభేరిని మోగించారు. ఈ ఒక్కమాటతో యావత్తు తెలంగాణ ప్రజల్లో మళ్లీ ఓ ఆశాదీపం వెలిగింది. కాంగ్రెస్ ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడడం ఖాయమని, హస్తం పార్టీ నేతలు ఇక అంతమయ్యే పాలనకు రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనని తెలంగాణవాదుల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ప్రజాచైతన్యాన్ని రగిల్చేలా సాగిందని రాజకీయ విశ్లేషకుల్లో చెప్తున్నారు.



**మళ్లీ బిగిసిన పిడికిలి**

పదేండ్లపాటు అభివృద్ధికి తీరమై అలరారిన రాష్ట్రాన్ని అవినీతి కాసారం చేస్తున్న కాంగ్రెస్‌పై యుద్ధం బీఆర్‌ఎస్ ప్రకటించింది. రజతోత్సవ సభ నింపిన ఉత్సాహంతో "కేసీఆర్ పూనుకుంటే.. పూనకాలే మరి! సారు దట్టి కట్టాడంటే.. పట్టు బిగించినట్టే!!" అంటూ అభిమానులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ తలరాతను మార్చడానికి నిండు అమాసనాడు.. ఓరుగల్లులో పింక్‌మూన్ విరిసింది. వందల ఎకరాల్లో విద్యుత్ దీపకాంతుల్లో గులాబీ తోట మిరుమిట్లు గొలిపింది. తెలంగాణ ప్రజల బతుకులను ఎండమావిగా మార్చిన హస్తం పార్టీ విధానాలతో గుండె మండిన కేసీఆర్.. కాంగ్రెస్ రాక్షస పాలనకు చరమ గీతం పాడటానికి ఎల్కతుర్తి వేదికగా, లక్షలాది జనం సాక్షిగా సమర శంఖం పూరించారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**మాటలే తూటాలు... ఓదార్పు మంత్రాలు**

"మీరు ధైర్యంగా ఉండండి.. మీ వెంట నేనుంటా. కాంగ్రెస్ పాలకులు చెడగొట్టినయన్నీ మళ్లీ మంచిగ చేసుకుందాం.. అందరి ముఖాల్లో చిరునవ్వులు చిందించే తెలంగాణను తయారు చేసుకుందాం" ఇదీ కేసీఆర్ ఇచ్చిన భరోసా. రజతోత్సవ సభలో గంటకు పైగా సాగిన ఉద్యమనేత ప్రసంగంలో అధికారం పోయిందన్న అసహనం లేదు. తాను సాధించిన రాష్ట్రం ఆగమైపోతుందన్న ఆవేదనే ప్రతీ మాటలో ప్రతిధ్వనించింది. తాను తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో రోజురోజుకూ దివాలా తీస్తున్నదనే బాధే కనిపించింది. అలా అని కాంగ్రెస్ పాలకులను నిందించలేదు.. నిలదీశారు. తూలనాడలేదు.. తూర్పారబట్టారు. ప్రతీమాటా తూకమేసినట్టు పలికారు. పాలకులను ఎలా నిలదీయాలో చెప్తూ ప్రశ్నాస్త్రాలను ప్రజలకు అందించారు. యుద్ధం ఎలా చేయాలో నేర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలతోనే చెప్పిస్తూ హస్తం నేతలకు సవాల్ విసిరారని, ఇది గొప్ప ఉద్యమపంథా అని విశ్లేషకులే చెప్తున్నారు.

**కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్**

తెల్లవడ్డ తెలంగాణను కాంగ్రెస్ ఆగమాగం చేస్తున్నదనో, ఆవేశంతోని మర్లవడమనో కేసీఆర్ చెప్పలేదు. ప్రజలే ఆలోచించాలని చెప్పారు. ఉద్యమానికి ఎలాగైతే మహాత్మా గాంధీ అహింసాయుత బాటను ఎంచుకున్నారో.. అదే పంథాలో కాంగ్రెస్ మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. అటకెక్కిన సంక్షేమాన్ని, రాజ్యమేలుతున్న సంక్షోభాన్ని సంస్కరించుకుందాని ఆశలు చిగురింపచేశారు. మరో మూడేండ్లు పకడ్బందీగా కాంగ్రెస్ అధికారంలోనే ఉండాలని, ప్రజలే తిరగబడే రోజు వస్తుందని తేల్చిచెప్పారు. ఇలా ఆద్యంతం ప్రజలను కార్యోన్ముఖులను చేసిన ప్రసంగం ప్రజలను తట్టిలేపిందని, దొంగ హామీలతో బోల్తాపడిన జనం.. మంచిరోజుల కోసం ఓపిక పట్టాలంటూ భరోసానిచ్చిందని అభిమానులు చెప్తున్నారు. కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ స్టార్టయిందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



## 15 నిమిషాల ప్రయాణం ఐదు గంటల సమయం

- సభకు పోటెత్తిన జనం
- భారీగా ట్రాఫిక్‌జామ్
- సభ సక్సెస్‌కు ఇదే నిదర్శనం

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ఎల్కతురి సభ ప్రాంగణం నుంచి హనుమకొండకు సాధారణంగా అయితే 15 నిమిషాల ప్రయాణం. కానీ, బీఆర్‌ఎస్ సభ ముగిసిన తర్వాత హనుమకొండకు వచ్చేందుకు సుమారు 5 గంటల సమయం పడుతుందని పోలీసులు అంచనా వేశారు. ఇక సభ నుంచి ఒక కిలోమీటరు దూరం కదలడానికి రెండు గంటల సమయం పట్టింది. ఇదీ ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ సభ అనంతరం నెలకొన్న పరిస్థితి. సభకు గులాబీదళం పోటెత్తడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జన సందోహాన్ని తలపించాయి. భారీగా వాహనాలు రావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాలు ముందుకు కదలడం గగనంగా మారింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సభకు రానివారే కిలోమీటర్ల ఆవల నిలిచిపోయారు. ఇక సభ నుంచి తిరిగి వెళ్లే వారు కూడా వాళ్లకు జత కావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో బీఆర్‌ఎస్ ఎల్కతుర్తి సభ సక్సెస్ అయిందని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏంటనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మీడియా అటెన్షన్... కేసీఆర్ సెన్సేషన్

- బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు టీవీ, డిజిటల్, సోషల్ మీడియా వేదికల్లో అనూహ్యమైన స్పందన
- కేసీఆర్ ప్రసంగాన్ని టీవీల్లో వీక్షించిన కోట్లాది మంది

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు సభాప్రాంగణానికి లక్షలాది మంది ప్రజలు పోటెత్తారు. సభకు హాజరుకాలేని కోట్లాది మంది టీవీలు, డిజిటల్, సోషల్ మీడియా వేదికల ద్వారా చూశారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా ఆదివారం సాయంత్రం ప్రతీ ఇంటిలో కేసీఆర్ ప్రసంగం మార్మోగింది. తెలంగాణలో ప్రధాన మీడియా చానళ్లు, ఏపీ కేంద్రంగా పనిచేస్తున్న కొన్ని చానళ్లు కేసీఆర్ ప్రసంగాన్ని లైవ్‌లో ప్రసారంచేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నదంటూ కేసీఆర్ వివరించిన విధానం ఆకట్టుకున్నదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

**అన్ని చానళ్లలో కేసీఆరే**

తెలుగులోని ప్రధాన న్యూస్ టీవీ చానళ్లలోనే కాకుండా యూట్యూబ్‌లోని తమ అఫీషియల్ అకౌంట్ల ద్వారా కూడా కేసీఆర్ ప్రసంగాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేశాయి. సోషల్‌మీడియా వేదికలైన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల నుంచి కూడా ఈ స్ట్రీమింగ్‌ను కొనసాగించాయి. తెలంగాణలోనే గుండె చప్పుడుగా గుర్తింపు పొందిన 'టీ న్యూస్' సహా రాష్ట్రంలోని మరి కొన్ని న్యూస్ చానళ్లు కేసీఆర్ ప్రసంగాన్ని తమ యూట్యూబ్ వేదికల్లో లైవ్ స్ట్రీమింగ్‌కు పెట్టాయి. మరో ఐదు న్యూస్ చానళ్లు స్ట్రీమింగ్ చేసిన కేసీఆర్ ప్రసంగానికి రియల్ టైమ్ వ్యూస్ 4.86 లక్షలు దాటింది. ఇవే చానళ్లకు చెందిన ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాల్లో మరో 3 లక్షల రియల్ టైమ్ వ్యూస్ వచ్చాయి. డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ఖాతాల్లోని అన్ని అకౌంట్లలో కలిపి కనీసం 15 లక్షల వరకూ రియల్ టైమ్ వ్యూయర్ షిప్ ఉండొచ్చని మీడియా వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**వ్యూస్ కోసం మల్టిపుల్ స్ట్రీమింగ్స్**

కేసీఆర్ ప్రసంగాన్ని వినాలని యావత్తు తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా యువత పెద్దఎత్తున ఆసక్తి కనబర్చారు. దీంతో వ్యూస్ కోసం కొన్ని న్యూస్ చానళ్లు యూట్యూబ్ వంటి డిజిటల్ మీడియా వేదికల్లో వేర్వేరు థంబ్ నెయిల్స్ పెట్టి కేసీఆర్ ప్రసంగాన్ని మల్టిపుల్ స్ట్రీమింగ్స్‌కు పెట్టాయి. అయినా ప్రతీ స్ట్రీమింగ్‌కు కనీసం 25 వేల నుంచి 50 వేల మంది రియల్ టైమ్ వ్యూయర్స్ రావడం విశేషమని, చాలా అరుదుగా ఇలాంటి స్పందన కనిపిస్తుందని మీడియా ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

**ఎల్కతుర్తి సభ డిజిటల్ వ్యూసే నిదర్శనం**

బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కోసం తెలంగాణ ప్రజలు ఎంతగా ఎదురుచూస్తున్నారో చెప్పడానికి డిజిటల్ వ్యూసే నిదర్శనమని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌పై ప్రజలకున్న ప్రేమను చెప్పడానికి ఇది చాలని ఆదివారం ఎక్స్ వేదికగా తెలిపారు. 'కరోనా సమయంలో ఇట్లా ఎదురుచూస్తుండే.. మళ్లీ ఇప్పుడు కూడా అలాగే ఎదురుచూస్తున్నారు' అని వెల్లడించారు. కేసీఆర్ ప్రసంగిస్తుండగా.. టీవీ 9 యూట్యూబ్ చానల్‌ను లక్ష మంది, టీన్యూస్ యూట్యూబ్ చానల్‌ను 67 వేల మంది చూసినట్టు తెలిపారు.

-వై సతీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

# కాంగ్రెస్ ఉలికిపాటు

- సీఎం సహా టీవీలకు అతుక్కుపోయిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఇంట్లోనే కేసీఆర్ ప్రసంగం వీక్షణ
- అక్కసు వెళ్లగక్కిన మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ మంత్రులు హైరానాపడ్డారు. ఏడాదిన్నరలో కాంగ్రెస్ సర్కారు చేసిన తప్పులను, ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చీల్చి చెండాడటంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో అలజడి చెలరేగింది. చాలాకాలం తర్వాత బహిరంగసభను నిర్వహిస్తున్న కేసీఆర్.. ఏం మాట్లాడతారో, తమను ఎలా ఎండగడతారోననే ఆందోళనతో ఉన్న మంత్రులు.. ఆదివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. కేసీఆర్ సభ ప్రారంభమైన దగ్గర్నుంచి, చివరి వరకూ.. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్‌లు సీఎం ఇంట్లో టీవీకి అతుక్కుపోయారు. కేసీఆర్ ప్రసంగానికి కచ్చితంగా కౌంటర్ ఇవ్వాలని మంత్రివర్గంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. దీంతో ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగం కొనసాగుతుండగానే.. మీడియా ప్రతినిధులకు 'సీఎం, మంత్రుల మీడియా సమావేశం ఉన్నది' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం వచ్చింది. కేసీఆర్ సభ పూర్తయిన మరుక్షణమే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి ఆగమేఘాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఇంటినుంచి బయటకి వచ్చి.. మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ మీద అక్కసు వెళ్లగక్కారు. మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే ముగించి మళ్లీ సీఎం ఇంట్లోకి వెళ్లిపోయారు. మీడియా మీటింగ్‌కు సీఎం వస్తారని మొదట సమాచారం వచ్చినా.. ఆయన రాలేదు. మంత్రుల తర్వాత ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, విప్ రాంచందర్‌నాయక్ మాట్లాడి తమ అక్కసు వెళ్లగక్కారు.